క్లుప్తంగా

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేట గ్రామ సచివాలయం వద్ద జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు ప్రారంభించారు. గ్రామానికి చెందిన 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సునీత తెలిపారు. వడదెబ్బకు తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాలవలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస, రావివలస, పాలవలస, పురుషోత్తపురం, పెద్దపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.రమేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పర్యటనలో ఆయా పంచాయతీల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, వీఆర్వోలు, వీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి



మాట్లాడుతున్న ఏపీఓ రవి

మెళియాపుట్టి: రానున్న (2024–25) ఆర్థిక సంవత్సరానికి ప్రతీ కుటుంబానికి 100 రోజుల ఉపాధి పని దినాల కల్పనలో భాగంగా పనులు గుర్తించాలని ఉపాధి ఏపీఓ టి.రవి అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ గ్రామంలో పనులు చేపట్టడానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు 90 రోజుల పని దినాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. చిన్న నీటికుంటల నిర్మాణాలు ఏర్పాటు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈసీ ఆదినారాయణ, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని మండల పౌరసరఫరాల అధికారి బి.కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని రైస్ మిల్లులను బుధవారం తనిఖీ చేశారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం విషయంలో ఎటువంటి కొర్రీలు వేయవద్దని సూచించారు. రైతులు వద్ద నుంచి ప్రతీ బస్తాకు అదనంగా కొన్ని కిలోల ధాన్యం తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిజమని తేలితే సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మిల్లర్ల వద్ద గల ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

ఎల్.ఎన్.పేట: మండలంలోని వంశధార నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టివేసినట్లు సరుబుజ్జిలి ఎస్సై బి.నిహార్ తెలిపారు. మండలంలోని బసవరాజుపేట వద్ద ఉన్న వంశధార నది నుంచి బుధవారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. బసవరాజుపేట గ్రామానికి చెందిన ఎస్.జగదీష్‌కు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వసంతపంచమి



పాతపట్నం: సాయిబాబా ధ్యాన మందిరంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట: తామరాపల్లిలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ శాంతారావు



నరసన్నపేట: నడగాం ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు
- సందడిగా సామూహిక అక్షరాభ్యాసాలు

సరస్వతీదేవి జన్మదినోత్సవం పురస్కరించుకుని వసంత పంచమిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. అధికమంది తమ పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతీ కటాక్షం సిద్ధించాలని మొక్కుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. పలుచోట్ల సరస్వతీదేవి విగ్రహావిష్కరణలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: కేజీబీవీలో సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థులు



బూర్జ: అల్లెన ఎంయూపీ స్కూల్‌లో సరస్వతీ దేవికి పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సరుబుజ్జిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతిదేవి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ భూషణరావు, విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిత్రో



జలుమూరు: గొల్లపేట ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యసాలు నిర్వహిస్తున్న దృశ్యం



హిరమండలం: కొమనాపల్లి ప్రాథమిక పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దుకాణాల సముదాయాన్ని వినియోగించుకోవాలి



దుకాణాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాబార్డు డీడీఎం వరప్రసాద్‌కుమార్

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్ ఆర్ కాలనీలో నాబార్డు ఆర్థికసాయంతో నిర్మిస్తున్న వ్యాపార దుకాణాల సముదాయాన్ని గిరిజన రైతులు వినియోగించుకోవాలని నాబార్డు డీడీఎం వరప్రసాద్ కుమార్ అన్నారు. దుకాణాల సముదాయం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గిరిజనులు పండిస్తున్న పంటలు దళారీల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్మాణం ద్వారా గిరిజన రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ధర తగ్గినప్పుడు ఈ దుకాణాల్లో అటవీ ఉత్పత్తులను నిల్వ ఉంచుకునే సాదుపాయం ఉంటుందన్నారు. కోల్డ్ స్టోరేజీలు, గొడౌన్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాల ద్వారా గిరిజన రైతుల్లో ఆదాయం సుస్థిరంగా ఉంటుందన్నారు. వంశధార ఎఫ్‌పీఓ, చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘం ఆధ్వర్యంలో దుకాణాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, ఆదివాసీ వికాస్ సంఘం అధ్యక్షురాలు పడాల లీసా, మన్య దీపిక సీఈఓ కైలాస్, గొర్లె శాంతి, వసర బృందావతి, గోవిందరావు, రామారావు, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. నౌతళ–శ్రీముఖలింగం రహదారి నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఇటీవల మంజూరు చేసిందన్నారు. పాతపట్నం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. అంతర్ జిల్లా, రాష్ట్ర రహదారులను సైతం అభివృద్ధి చేశామన్నారు. నరసన్నపేట నుంచి పాతపట్నం వరకు రోడ్డు విస్తరణ చేపట్టినట్టు తెలిపారు. సీఎం జగన్‌కు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జె.సుధాకర్, ఈఈ రవి నాయక్, డీఈ సాగర్, ఏఈ గోపాలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, నాయకులు బి.శ్రీనివాసరావు, నక్క ఆనంద రావు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. డ్రైనేజీల్లో పూడికలను తొలగించి గ్రామానికి దూరంగా వేయాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగుచేయించి తాగునీరు అందించాలన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఈఓపీఆర్డీ పద్మజ ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పూడికలను తరలిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కొత్తూరు: మండల కేంద్రంలోని పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను పారిశుద్ధ్య కార్మికులు బుధవారం తొలగించారు. పూడికలను ప్రత్యేక వాహనం ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు పర్యవేక్షించారు.

ముగిసిన గ్రిగ్స్ పోటీలు



లాంగ్‌జంప్ వేస్తున్న విద్యార్థిని

- బాలురు విభాగంలో ఆల్‌రౌండర్‌గా పెద్దసీది, బాలికల విభాగంలో కడుము

టెక్కలి: టెక్కలిలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గ్రిగ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలురు విభాగంలో పాతపట్నం మండలం పెద్దసీది, బాలికల విభాగంలో కొత్తూరు మండలం కడుము జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఆల్ రౌండ్ చాంపియన్‌గా నిలిచాయి. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ క్రీడలతో పాటు అథ్లెటిక్ విభాగంలో లాంగ్‌జంప్, రన్నింగ్, షార్ట్‌పుట్ తదితర క్రీడలు నిర్వహించారు. టెక్కలి జోన్ వ్యాయామ విభాగం పీడీలు బి.నారాయణరావు, శేఖర్‌బాబు, జనార్దనరావు, శ్రీనివాస్, రామిరెడ్డి, రమేష్, ప్రకాశ్, జగ్గమ్మ, సూర్యకాంతం, ఆదిశేషు, ఢిల్లేశ్వరి, రీతుసోనా, రాజా తదితరులు పర్యవేక్షణ చేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న బ్రెడ్స్ సంస్థ డైరెక్టర్ కోదండపాణి

హిరమండలం: గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కోదండపాణి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, చిరుధాన్యాల సాగు, ప్రకృతి వసాయం, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఏఓ బి.సంధ్య, ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి, ఎంఈఓ రాంబాబు, ఏపీఓ శ్రీనివాసరావు, ఏఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

- తాగునీటి పథకానికి రూ.265 కోట్లు మంజూరయ్యాయి
- శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు ఇంటింటికీ వంశధార జలాలను స్వచ్ఛమైన తాగునీరుగా అందిస్తామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.265 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకం నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శంకుస్థాపన ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శ్రీనివాసప్రసాద్, ఈఈ జి.జాన్‌బెన్హర్, డీఈ మధుసూదనరావుకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల్లోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ఫేజ్–2లో భాగంగా రూ.265 కోట్లు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గంలోని సుమారు 440 గ్రామాలకు తాగునీరు అందించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. పాతపట్నం మండలంలో పనులు చేపట్టేందుకు అవసరమైన స్థలంలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే ట్యాంకర్ల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట కొత్త బోర్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓలతో మాట్లాడి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

సైనికులకు అండగా ఉంటాం

- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



పారామిలటరీ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: దేశం కోసం నిరంతరం సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనుకులకు అండగా ఉంటామని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద పాత జాతీయ రహదారికి ఆనుకుని జిల్లా పారామిలటరీ సంఘ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ రక్షణలో పారామిలటరీకి చెందిన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, పీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ తదితర విభాగాలకు చెందిన సైనికుల త్యాగాలను, వారి శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పారామిలటరీ సంఘం ప్రతినిధులు యాళ్ల అప్పలనాయుడు మాట్లాడుతూ తమ సంఘ భవనానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్యను సంఘం తరఫున సత్కరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ డేవిడ్, పారామిలటరీ సంఘం ప్రతినిధులు బోర మాధవరావు, సి.హెచ్.రామారావు, పి.ఎల్.నారాయణరావు, బి.గోపాలరావు, కె.వి.ఆర్.మూర్తి, సంఘం మహిళా విభాగం ప్రతినిధి గంగిట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సర్వేపై ఫిర్యాదు



ఈఆర్‌ఓకు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: టీడీపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తూ ఓటర్ల సమాచారం అడుగుతున్నారని, ఈ సర్వేను నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుకు మోహన్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పాతపట్నం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.వెంకటేశ్వరరావుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ నాయకులు గ్రామాల్లో పర్యాటిస్తూ.. ఓటర్ల వివరాలు నమోదు చేసుకుని, సెల్ ఫోన్‌కు ఓటీపీలు పంపిస్తున్నారని, వ్యక్తిగత సమాచారం కూడా సేకరిస్తున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో పార్టీ మండల కార్యదర్శి జి.రాము, నాయకులు త్రినాథరావు, రాజు, వరదరాజులు, సుధ, నేతాజీ ఉన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

హిరమండలం: ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఫిజియోథెరపీ వరమని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. మండల భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. ప్రత్యేకావసరాల గల చిన్నారులకు ఐఈఆర్టీ వైద్యురాలు గ్రేసీ ప్రీతి ఫిజియోథెరపీ చేశారు. ఫిజియోథెరపిస్టు మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటివద్ద సాధన చేస్తే ప్రతిఫలం ఉంటుందన్నారు. మండలం నలుమూలల నుంచి ప్రత్యేకావసరాలగల చిన్నారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ట.కేశవరావు, ఐఆర్‌టీసీ ఉపాధ్యాయుడు సీతంనాయుడు, సీఆర్పీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు

నేడు పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

జలుమూరు: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ప్రభుత్వ నూతన భవనాలను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ గురువారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రావిపాడు, లింగాలువలస, చల్లవానిపేట, టీ.లింగాలపాడు, యలమంచిలి, శ్రీముఖలింగం, మర్రివలస, అంధవరం గ్రామాల్లో పర్యటిస్తారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ జోనల్ ఇన్‌చార్జ్ ధర్మాన కృష్ణచైతన్య హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.